
సాక్షి
కుమురం భీం

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



వంతెనలు లేక అవస్థలు

వాగులపై వంతెనలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. వాగులు ఉప్పొంగినప్పుడల్లా ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. 9లో▸



జనావాసాల్లోకి నెమలి

కాగజ్‌నగర్‌రూరల్‌: అటవీ ప్రాంతం నుంచి ఓ నెమలి జనావాసాల్లోకి వచ్చింది. శనివారం కాగజ్‌నగర్‌ పట్టణంలోని సర్‌సిల్క్‌ మార్కెట్‌ ఏరియాలో సంచరించింది.

గరిష్టం/కనిష్టం
33.3 /26.6

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

నేడు సర్వాయి పాపన్నగౌడ్‌ జయంతి

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఆవరణలో ఆదివారం సర్దార్‌ సర్వాయి పాపన్న గౌడ్‌ జయంతి నిర్వహిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి సజీవన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దివ్యాంగులకు ప్రీమెట్రిక్‌, పోస్ట్‌మెట్రిక్‌ స్కాలర్‌షిప్‌లు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 31లోగా ప్రీమెట్రిక్‌ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్‌ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఇంటర్‌, డిగ్రీ, పీజీ చదువుతున్న దివ్యాంగ విద్యార్థులు అక్టోబర్‌ 31 పోస్ట్‌ మెట్రిక్‌ స్కాలర్‌షిప్‌లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలి

ఆసిఫాబాద్‌: స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌ నుంచి ఓటరు జాబితా రూపకల్పన, ఇంటింటి సర్వే నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి 28 వరకు ప్రీరివిజన్‌ యాక్టివిటీస్‌, 29 నుంచి రివిజన్‌ యాక్టివిటీస్‌ నిర్వహించాలని సూచించారు. మొదటి 30 రోజుల్లో ఇంటింటి సర్వే నిర్వహించి 18 ఏళ్లు నిండినవారిని జాబితాలో నమోదు చేయాలన్నారు. ఒకే కుటుంబానికి చెందిన వారు ఒకే పోలింగ్‌ బూత్‌ పరిధిలో ఉండేలా జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, సహాయ ఎన్నికల రిటర్నింగ్‌ అధికారులు వారి పరిధిలోని ప్రతీ పోలింగ్‌ కేంద్రాన్ని సందర్శించాలన్నారు. మాస్టర్‌ ట్రైనర్లతో సిబ్బందికి శిక్షణ అందించాలన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్‌ ఎన్నికలకు సంబంధించిన ఓటరు జాబితాను బూత్‌స్థాయి అధికారులకు అందించి సెప్టెంబర్‌ 15లోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ నుంచి కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే పాల్గొన్నారు. జిల్లాలో స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్‌, కలెక్టరేట్‌ ఏవో మధుకర్‌ పాల్గొన్నారు.

‘మా వార్డులు మున్సిపాలిటీలో కలపాలి’

ఆసిఫాబాద్‌/ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని గుండి రహదారిపై గల సర్వే నం. 63, 64, 65లో గల వార్డులను ఆసిఫాబాద్‌ మున్సిపాలిటీలో కలపాలని కాలనీవాసులు శనివారం మున్సిపల్‌ కమిషనర్‌ భుజంగరావుకు వినతిపత్రం సమర్పించారు. పట్టా భూముల్లో నివాసం ఉంటున్న తమను ఏజెన్సీ ప్రాంతమైన రాజంపేటలో కలపవద్దని కోరారు. ఇటీవల మున్సిపల్‌, పంచాయతీ విభజనలో భాగంగా చేపట్టిన సర్వే తమ ఇంటి నంబర్లు మున్సిపల్‌ పరిధిలో లేవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు వాసుదేవన గిరీశ్‌కుమార్‌, డి.సతీశ్‌కుమార్‌, ప్రదీప్‌, ప్రహ్లాద్‌, వెంకట్‌గౌడ్‌, మహేశ్‌గౌడ్‌, సంతోష్‌, గిరిగౌడ్‌, గోవింద్‌, నరేశ్‌, వినాయర్‌, ఆశిష్‌ ఉన్నారు.

యోగాపై పట్టు సాధించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్‌): యోగాపై పట్టు సాధించి జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటాలని యోగాసన స్పోర్ట్స్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు కేసరి ఆంజనేయులుగౌడ్‌ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సీఈఆర్‌ క్లబ్‌లో శనివారం ఐదో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. పలు మండలాల నుంచి సుమారు 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. జిల్లా పరిశీలకుడు మంద శ్రీనివాస్‌, ఆర్గనైజింగ్‌ కార్యదర్శి కేసరి ఆలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం పరులపాలు!?

- రూ.4 కోట్ల విలువైన కాగజ్‌నగర్‌ మున్సిపల్‌ స్థలానికి ఎసరు
- కుట్రదారులతో కౌన్సిలర్లు, అధికారుల కుమ్మక్కు
- ఎనిమిదేళ్లుగా సిర్పూర్‌ కోర్టులో కాంప్లెక్స్‌ స్థలవివాదం
- అదే స్థలానికే అక్రమంగా ఇంటి నంబరు కేటాయింపు
- సర్వే నంబరు మార్చి.. 497 చదరపు గజాలు రిజిస్ట్రేషన్‌ చేసుకున్న వైనం



నిర్మాణ దశలో ఆగిన మున్సిపల్‌ కాంప్లెక్స్‌ వద్ద కొనసాగుతున్న వ్యాపారాలు

సాక్షి, ఆసిఫాబాద్‌: కాగజ్‌నగర్‌ మున్సిపాలిటీకి చెందిన స్థలం పరులపాలైంది. రూ.కోట్లు విలువ చేసే స్థలాన్ని దర్జాగా వారి పేరిట రిజిస్ట్రేషన్‌ కూడా చేయించేసుకున్నారు. గత ఎనిమిదేళ్లుగా సిర్పూర్‌ కోర్టులో ఈ స్థల వివాదం నడుస్తుండగా.. ఇప్పుడు అదే స్థలానికి పురపాలక సంస్థకు వ్యతిరేకంగా కోర్టులో కేసు వేసిన మహిళ పేరిటే మున్సిపల్‌ అధికారులు ఇంటి నంబరు కేటాయించడంపై పట్టణంలో చర్చనీయాంశమైంది. స్థలాన్ని కొల్లగొట్టే వ్యవహారంలో సహకరించిన మున్సిపల్‌ అధికారులతోపాటు పలువురు కౌన్సిలర్లకు రూ.లక్షల్లో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. గుట్టుచప్పుడుగా జరిగిన ఈ వ్యవహారం ఇప్పుడు బహిర్గతం కావడంతో మున్సిపల్‌ అధికారులు తప్పును కప్పిపుచ్చే యత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

ప్రభుత్వం 2008లో కార్మికశాఖకు చెందిన సర్వే నంబరు 147/2లోని 4.50 ఎకరాల స్థలాన్ని కాగజ్‌నగర్‌ మున్సిపాలిటీకి కేటాయించింది. ఎన్టీఆర్‌ చౌరస్తా నుంచి పట్టణంలోకి వెళ్లే రహదారికి ఇరువైపులా ఈ స్థలం ఉంది. మున్సిపల్‌ కార్యాలయానికి ఎదురుగా ఉన్న 497 చదరపు గజాల స్థలంలో వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్న క్రమంలోనే ఈ స్థలం తనదంటూ రాపెల్లి భాగ్యలక్ష్మి సిర్పూర్‌ కోర్టును 2016లో ఆశ్రయించి నిర్మాణ పనులపై ఇంజెక్షన్‌ ఆర్డర్‌ తెచ్చుకుంది. అప్పటి నుంచి ఇరువర్గాల మధ్య స్థల వివాదం కొనసాగుతోంది. అప్పట్లో మున్సిపల్‌ అధికారులు టెండర్‌ ద్వారా కాంప్లెక్స్‌ నిర్మాణ పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించి రూ.15 లక్షల వరకు ఖర్చు చేశారు.


పంపకాలకు ఎత్తుగడ

సర్కారు స్థలాన్ని అక్రమంగా చేజిక్కించుకున్నామని భావించిన ఇద్దరు మున్సిపల్‌ కౌన్సిలర్లు పట్టణానికి చెందిన నలుగురు వ్యాపారులతో ఒక్కో గదికి రూ.5 లక్షల చొప్పున రూ.20 లక్షలు ముందుగానే నగదు తీసుకున్నట్లు సమాచారం. మున్సిపల్‌ కాంప్లెక్స్‌లో మొత్తం 12 గదులు నిర్మాణ దశలో ఆగిపోగా.. ఇప్పుడా స్థలాన్ని సర్వే నంబరు మార్చి దక్కించుకున్న వ్యక్తితోపాటు కౌన్సిలర్లు ఇద్దరు విక్రయానికి యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సుమారు రూ.4 కోట్లకు స్థలాన్ని విక్రయించి పంపకాలు చేసుకోవాలని ఎత్తుగడ వేసినట్లు సమాచారం.

ఇంటి నంబరు రద్దు చేస్తాం

ఎన్టీఆర్‌ చౌరస్తాలో పునాదుల దశలో ఆగిపోయిన మున్సిపాలిటీ స్థల వివాదం సిర్పూర్‌ కోర్టులో ఉంది. ఇప్పుడా స్థలానికి అక్రమంగా ఇంటి నంబరు తీసుకుని రిజిస్ట్రేషన్‌ చేసుకున్న విషయం నా దృష్టికి వచ్చింది. విచారణ చేపట్టాం. ఆ స్థలానికి ఇంటి నంబరు కేటాయించినట్లు తెలితే దానిని వెంటనే రద్దు చేస్తాం. అలాగే రిజిస్ట్రేషన్‌ కూడా రద్దు చేయాలని కోరుతూ రిజిస్ట్రేషన్‌ శాఖ ఉన్నతాధికారులకు లేఖ రాస్తాం. అక్రమార్కులతో చేతులు కలిపిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.

– అంజయ్య, కమిషనర్‌, కాగజ్‌నగర్‌ మున్సిపాలిటీ





2016లో 147/2 సర్వే నంబరులోని స్థలం మున్సిపాలిటీకి చెందినదిగా గుర్తిస్తూ కాగజ్‌నగర్‌ మండల సర్వేయర్‌ గీసిన స్కెచ్‌.. గూగుల్‌ మ్యాప్‌లోనూ ఈ స్థలం మున్సిపాలిటీదేనని చూపుతోంది

ఆగమేఘాలపై ఇంటి నంబరు..

రూ.కోట్లు విలువైన స్థలంపై కన్నేసిన ఇద్దరు మున్సిపల్‌ కౌన్సిలర్లు స్థలాన్ని చేజిక్కించుకునే యత్నంలో మున్సిపల్‌ అధికారులతో చేతులు కలిపారు. వారి ప్రణాళికలో భాగంగానే కోర్టు వివాదంలో ఉన్న సర్వే నం.147/2లో ఉన్న స్థలానికే సర్వే నంబరు మార్చి(146 సర్వే నంబరుగా చూపుతూ) ఇంటి నంబరు కేటాయించాలంటూ రాపెల్లి భాగ్యలక్ష్మి గత నెల 13న మున్సిపాలిటీకి దరఖాస్తు చేసుకుందనే ఆరోపణలున్నాయి. ఆమె దరఖాస్తు చేయడం మొదలు మున్సిపల్‌ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండానే జూలై 18న మున్సిపాలిటీకి చెందిన స్థలానికే 1–16–552/4/ఏ అనే ఇంటి నంబరు కేటాయించారు. మరుసటి రోజు అంటే జూలై 19న భాగ్యలక్ష్మి 497 చదరపు గజాల స్థలాన్ని తన కుమారుడు వెంకట సాయిబాబుకు గిఫ్ట్‌డీడ్‌గా రిజిస్ట్రేషన్‌ చేయించింది. ఇంటి నంబరు కేటాయింపు వ్యవహారంలో మున్సిపాలిటీకి చెందిన ముఖ్య అధికారి కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. అయితే భాగ్యలక్ష్మి సర్వే నంబరు 146లోని 497 చదరపు గజాల స్థలానికి ఉత్తరాన రోడ్డు, దక్షిణాన నాలా, తూర్పున రోడ్డు, పడమర రోడ్డుగా సరిహద్దులు చూపగా.. మున్సిపాలిటీకి చెందిన 147/2లోని 497 చదరపు గజాల స్థలానికి కూడా అవే సరిహద్దులు ఉండటంతో కుట్ర వెలుగులోకి వచ్చింది.



Sl. No.	Description of the Property	Date Execution Date Presentation Date	Nature of Deed Market Value Consideration Value	Name of Parties Executant (EX) & Claimants (CL)	CD No. Doct No./Year [Schedule No.] SRO
1/5	VILL/COL: KAGAZ NAGAR/PETROL PUMP AREA TO KANKAIAH WORK SHOP W-B: 1-16 SURVEY: 146 HOUSE: 1-16-552/4/3/A EXTENT: 497SQ.Yds Boundaries: [N]: ROAD [S]: NALA [E]: ROAD [W]: ROAD	(R) 19-07-2024 (E) 19-07-2024 (P) 19-07-2024	Gift in favour of family members Mkt.Value:Rs. 3379600	1.(DR)RAPELLY BHAGYALAXMI 2.(DE)RAPELLY VENKATA SAI BABU	0/0 1103/2024 [1] of SRO ASIFABAD(1901)

రాపెల్లి వెంకట సాయిబాబు పేరిట జరిగిన రిజిస్ట్రేషన్‌

జిల్లా కేంద్రంలో వైద్యుల నిరసన



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిరసన తెలుపుతున్న వైద్యసిబ్బంది

- ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ సేవలు బంద్‌
- ప్రైవేట్‌ ఆస్పత్రులు మూసివేత..
- పట్టణంలో భారీ ర్యాలీ

ఆసిఫాబాద్‌: కోల్‌కతాలో యువ పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌(ఐఎంఏ) పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్‌ ఆస్పత్రులు మూసివేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ నిలిపి వేసి కేవలం అత్యవసర సేవలు మాత్రమే అందించారు. పట్టణంలో వైద్యులు, వైద్యసిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆస్పత్రి నుంచి అంబేద్కర్‌ చౌక్‌ మీదుగా కలెక్టరేట్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో సిద్దార్థ మాట్లాడుతూ యువ పీజీ డాక్టర్‌ను హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహేశ్‌, సత్యనారాయణ, శ్రీనివాస్‌, లక్ష్మి, ఉషారాణి, అన్సారీ, గ్రామీణ వైద్యులు రూప్‌నర్‌ రమేశ్‌, అజయ్‌కుమార్‌, నారాయణ, మధు, శ్రీనివాస్‌, కేదారిగౌడ్‌, వెంకన్న, అశోక్‌, శ్రీనివాస్‌, ప్రభాకర్‌, పాలక్‌రావు, కెరమెరి, వాంకిడి, ఆసిఫాబాద్‌ మండలాలకు చెందిన గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ తీస్తున్న వైద్యులు, సిబ్బంది

వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్‌: సీజనల్‌ వ్యాధుల నియంత్రణపై అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలోని వీడియో కాన్ఫరెన్స్‌ హాల్‌ నుంచి శనివారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారి, ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్‌తో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, ప్రత్యేకాధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహాల పర్యవేక్షకులు, కార్యదర్శులతో సీజనల్‌ వ్యాధుల నియంత్రణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ వైద్యసిబ్బంది తమ పరిధిలోని గ్రామాలను సందర్శించి ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్స అందించాలన్నారు. రహదారులు సక్రమంగా లేని గ్రామాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లోని గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని సమీప ప్రాథమిక ఆస్పత్రులకు తరలించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం పోషక విలువలు కలిగిన భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో తుకారాం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్‌, డీఎల్‌పీవో ఉమర్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

‘పోడు’ హక్కుల కల్పనకు విధివిధానాలు

- రాష్ట్ర అటవీ మంత్రి కొండా సురేఖ



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు

ఆసిఫాబాద్‌: పోడు భూములు సాగు చేసుకుంటున్న అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు విధివిధానాలు రూపొందిస్తామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం హైదరాబాద్‌ నుంచి మరో మంత్రి సీతక్క, ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి సురేఖ మాట్లాడుతూ పోడు భూముల సమస్య పరిష్కారం కోసం అర్హులైన గిరిజనులకు హక్కులు కల్పించేందుకు విధివిధానాల రూపకల్పన చేయాలన్నారు. పెండింగ్‌ దరఖాస్తులను గుర్తించాలని, భూముల విషయంలో వివాదాలు ఉంటే క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ నుంచి కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ ఆర్డీవోలు లోకేశ్వర్‌, సురేశ్‌ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. కలెక్టర్‌ మాట్లాడుతూ పోడు భూముల సమస్య శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ముల్కలమందలో పులి సంచారం!



పాదముద్రలు పరిశీలిస్తున్న అధికారులు

తిర్యాణి(ఆసిఫాబాద్‌): మండలంలోని ముల్కలమంద బీట్‌ శివారులో పులి సంచరిస్తున్నట్లు ఫారెస్ట్‌ రేంజ్‌ అధికారి శ్రీనివాస్‌ తెలిపారు. శనివారం సిబ్బందితో కలిసి పాదముద్రలను పరిశీలించారు. శ్రీనివాస్‌ మాట్లాడుతూ ముల్కలమంద బీట్‌లో తిరుగుతున్నది పులా.. చిరుతా.. అనే విషయాన్ని త్వరలోనే నిర్ధారిస్తామని తెలిపారు. సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కొన్నిరోజుల పాటు అటవీ ప్రాంతంలోకి వెళ్లొద్దన్నారు.

‘అవినీతి’ గుట్టు బయటపడేదెలా..?

- రెబ్బెన పీఏసీఎస్‌లో మృతిచెందిన రైతుల పేర్ల మీద రుణాలు..
- విచారణ చేపట్టాలని నాయకులు, రైతుల డిమాండ్‌
- నాన్చుడు ధోరణిలో జిల్లా ‘సహకార’ అధికారులు



అక్రమాలపై నిలదీస్తున్న బాధితులు

రెబ్బెన(ఆసిఫాబాద్‌): రెబ్బెన ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ద్వారా తీసుకున్న రుణాల్లో చోటుచేసుకున్న అవినీతి గుట్టు ఎలా బయటపడుతుందో అంతుచిక్కడం లేదు. ఆదిలాబాద్‌ డీసీసీబీ ఆసిఫాబాద్‌ శాఖ ద్వారా చాలామంది ఖాతాదారులు రుణాలు తీసుకోకపోయినా తీసుకున్నట్లు గుర్తించిన విషయం తెలిసిందే. అలాగే మృతిచెందిన వ్యక్తుల పేర్ల మీద ఉన్న రుణాలను సైతం గతేడాది రెన్యువల్‌ చేసినట్లు డీసీసీబీ రికార్డులు చూపిస్తున్నాయి. రెండు రోజులుగా రెబ్బెన పీఏసీఎస్‌ వద్ద రైతులు, రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన చేస్తున్నా జిల్లా సహకార శాఖ అధికారులు పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. శనివారం అసిస్టెంట్‌ రిజిస్ట్రార్‌ రబ్బానీ రెబ్బెన పీఏసీఎస్‌కు చేరుకుని విచారణ చేపట్టినా.. ఏ విషయాన్ని తేల్చకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

రుణాలు తీసుకున్నది ఎంతమంది..?

రెబ్బెన నుంచి కేవలం 374 మంది రైతులు మాత్రమే డీసీసీబీ ఆసిఫాబాద్‌ శాఖలో రుణాలు తీసుకున్నట్లు ఇక్కడి పీఏసీఎస్‌ సిబ్బంది చెబుతున్నారు. రుణాల జాబితాలో మాత్రం 524 మంది తీసుకున్నట్లు ఉంది. అవినీతిపై విచారణ చేపట్టాల్సిన అధికారులే నాన్చుడు ధోరణి ప్రదర్శిస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీసుకున్న రుణాలకు పూర్తిగా అసలు, వడ్డీలు చెల్లించి నో డ్యూ సరిఫికెట్లు పొందిన రైతులు సైతం ఇంకా సహకార బ్యాంకులో అప్పు ఉన్నట్లు చూపుతున్నారు. దీంతో ఒక్కో రైతు రూ.2లక్షల కంటే అధికంగా రుణాలు తీసుకున్నట్లయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రూ.2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేయగా.. అంతకంటే ఎక్కువ రుణం ఉన్న వారి పేర్లు రుణమాఫీ జాబితాలో లేవు. అధికారుల నిర్లక్ష్యంతో అర్హులు కూడా మాఫీకి నోచుకోవడం లేదు.

బాధ్యులెవరు..?

రెబ్బెన పీఏసీఎస్‌ ద్వారా డీసీసీబీలో రుణాల అవినీతిలో కిందిస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి వరకు భాగస్వామ్యం ఉందని రైతులు ఆరోపిస్తున్నారు. శనివారం మరికొంత మంది రుణాల విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే సహకార బ్యాంకు ద్వారా రుణం మంజూరు చేస్తే దస్త్రాలపై సంతకాలు ఉంటాయని అధికారులు చెబుతున్నారు. పీఏసీఎస్‌ ద్వారా రుణాలు తీసుకున్న ప్రతీ ఖాతాదారుకు సంబంధించి బ్యాంకు లావాదేవీల రిపోర్టు తీసి పరిశీలించి విచారణ చేపడితే పూర్తి వివరాలు బయటికి వచ్చే అవకాశం ఉంది.

మరణించిన వారి పేరిట రుణాలు

రెబ్బెన పీఏసీఎస్‌ ద్వారా రుణాలు పొందిన రైతుల్లో కొంతమంది మరణించగా.. వారి పేర్ల మీద రుణాలు తీసుకున్నట్లు సహకార బ్యాంకు సిబ్బంది లెక్కలు చూపుతున్నారు. తుంగెడకు చెందిన మానెం సాంబయ్య మూడేళ్ల క్రితం మృతి చెందగా.. అతడు గతేడాది జూలై 31న రూ.1,05,000 రుణం తీసుకున్నట్లు బ్యాంకు రికార్డుల్లో ఉంది. ప్రస్తుతం వడ్డీతో కలిపి రూ.1,07,000 అప్పు ఉన్నట్లు చూపిస్తున్నారు. అలాగే నంబాలకు చెందిన పూదరి పాపయ్య గతంలో మృతి చెందగా అతడి పేరు మీద సైతం రూ.52,000 రుణాన్ని గతేడాది తీసుకున్నట్లు ఉంది. నారాయణపూర్‌కు చెందిన అనిశెట్టి చిన్నక్క ఐదేళ్ల క్రితం మృతి చెందగా గతేడాది రూ.43,000 రుణం, నంబాలకు చెందిన బొమ్మినేని శాంతమ్మ నాలుగేళ్ల క్రితం మృతి చెందగా.. గతేడాది జూలైలో రూ.19,657 రుణం తీసుకున్నట్లు చూపిస్తున్నారు. ఇలా పదుల సంఖ్యలో ఖాతాదారులు మృతి చెందినా వారు గతేడాది రుణాలు తీసుకున్నట్లు రికార్డులు చూపుతున్నారు. చనిపోయిన వారు బతికి ఉండగా రుణాలు తీసుకుని చెల్లించకుండానే మృతి చెందారు అని అనుకున్నా.. చనిపోయిన వ్యక్తుల సంతకాలు లేకుండా రుణాలు ఎలా రెన్యువల్‌ అయ్యాయో అంతు చిక్కడం లేదు.

విచారణ చేపట్టాలని ఫిర్యాదు

రెబ్బెన పీఏసీఎస్‌ ద్వారా సహకార బ్యాంకులో మంజూరు చేసిన రుణాల విషయంలో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టాలని శనివారం పీఏసీఎస్‌ చైర్మన్‌ కార్నాథం సంజీవ్‌కుమార్‌, వైస్‌ చైర్మన్‌ రంగు మహేశ్‌గౌడ్‌తోపాటు రాజకీయ పార్టీల నాయకులు, బాధిత రైతులు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో వేర్వేరుగా ఫిర్యాదు చేశారు. అలాగే సీఈవో సంతోష్‌పై వచ్చిన అభియోగాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

అవినీతిపరులను విడిచిపెట్టం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్‌: అవినీతిపరులు ఎంతటివారైనా విడిచిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంతోపాటు బ్యాంకును శనివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బెజ్జూర్‌ సహకార సంఘంలో జరిగిన అవినీతిపై రిజిస్టర్‌ కోఆపరేటివ్‌ సొసైటీకి లేఖ రాస్తానని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా చూస్తానన్నారు. అలాగే సొసైటీలో రుణమాఫీ అయిన రైతులకు డబ్బులు సక్రమంగా ఇవ్వడంలేదని రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. డీసీసీబీ సీఈవోతో ఎమ్మెల్యే ఫోన్‌ ద్వారా మాట్లాడామన్నారు. మొదటి విడతలో 648, రెండో విడత 235, మూడో విడతలో 175 మందికి రుణమాఫీ కాగా, వీరికి డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారని సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. సీఈవో స్పందిస్తూ.. ప్రతిరోజూ వందమంది చొప్పున.. ఆధార్‌కార్డు, పాసుబుక్కులు తెచ్చిన వారికి డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. మన్నెవార్‌ కొలావార్‌ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. అంతకుముందు మండల కేంద్రంలోని రైతువేదికలో 57 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో గౌరీశంకర్‌, డీటీ బీమ్లా నాయక్‌, మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌ ఆత్రం రాజన్న, సింగిల్‌ విండో డైరెక్టర్‌ శ్రీవర్ధన్‌, బాపు, బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణ, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

క్లుప్తంగా

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

లింగాపూర్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రాథోడ్ కిషన్ (44) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మద్యానికి బానిసయ్యాడు. ఏడాదిగా వ్యవసాయ పనులు, ఇతర అవసరాల కోసం రూ.2 లక్షలు అప్పు చేశాడు. ఈక్రమంలో మద్యం మత్తులో గురువారం భార్యతో గొడవపడ్డాడు. దీంతో అతడి భార్య పక్కింటి సమీప బంధువుల ఇంటికి వెళ్లింది. అనంతరం కిషన్ గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య సురేఖాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరికి రిమాండ్

దండేపల్లి: మండలంలోని ముత్యంపేటకు చెందిన కొండా నరేశ్‌ను రిమాండ్ చేసినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నరేశ్‌పై గతంలో పలు కేసులు నమోదు కావడంతో పాటు 2021లో రౌడీషీట్ కూడా ఓపెన్ చేశారు. అయినా అతనిలో మార్పు రాకపోవడం, ఇటీవల నెల్కి వెంకటాపూర్‌లో ఓ భూవివాదంలో తలదూర్చడంతో అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నకిలీ రిపోర్టర్ అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ నరేందర్

జన్నారం: ఓ ప్రైవేట్ పాఠశాల హెచ్‌ఎంను స్టాఫ్ రిపోర్టర్‌నంటూ డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు లక్సెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. మండలకేంద్రానికి చెందిన జయరాణి పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌ను ఓ పత్రిక స్టాఫ్‌రిపోర్టర్‌ను అని నెన్నెలకు చెందిన రత్నం తిరుపతి డబ్బులు డిమాండ్ చేసినట్లు ఈనెల 11న ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదైంది. శనివారం తిరుపతిని అరెస్ట్ చేసి లక్సెట్టిపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరిపై కేసు


బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని శనివారం పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై కే మహేందర్ తెలిపారు. రామకృష్ణాపూర్ రామాలయం ఏరియాకు చెందిన పొన్నాల వెంకటేశ్, వెంకటేశ్వరస్వామి గుడి ప్రాంతంలో నివాసముంటున్న కుంటాల అరవింద్ గంజాయి రవాణా చేస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి 82 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈమేరకు నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రయాణికుల భద్రతకు 'టీ-సేఫ్'

- క్యాబ్, ఆటోలపై పోలీస్ నిఘా
- అలర్ట్‌గా మహిళా భద్రతావిభాగం
- వినూత్న సేవలందిస్తున్న వైనం
- అవగాహన కల్పిస్తున్న పోలీసులు



టీ-సేఫ్ యాప్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ శ్రీనివాసులు, అధికారులు



టీ-సేఫ్ యాప్

మంచిర్యాలక్రైం: ఒంటరిగా మహిళలలే కాదు.. పురుషులూ ప్రయాణం చేయాలంటే భయపడుతున్న ఈ రోజుల్లో మనం జీవిస్తున్నాం. ఎవరిని నమ్మాలో.. ఎవరిని నమ్మకూడదో తెలియడం లేదు. సురక్షిత ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయణించాలని ఆర్టీసీ అధికారులు ముమ్మర ప్రచారం చేస్తున్నారు. బస్సు ప్రయాణం ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లాలన్నా.. ఇంటి నుంచి బస్టాండ్, మార్కెట్‌కు వెళ్లాలన్నా సామాన్య మధ్య తరగతి ప్రజలు ఆటోలు లేదా క్యాబ్‌ల్లోనే వెళ్లాల్సి ఉంటుంది. గతంలో కొందరు ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్ల చెడు ప్రవర్తనతో ప్రయాణికులు ఆటో డ్రైవర్లపై మంచి అభిప్రాయాన్ని కోల్పోయారు. దీంతో ఆటోలు, క్యాబ్‌ల్లో ప్రయాణించే మహిళలు, ఒంటరిగా ఉన్న ప్రతీ ఒక్కరికి భద్రత కల్పించేందుకు తెలంగాణ పోలీస్ సరికొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. మహిళలు, బాలికలు, ఇతర పౌరులు ఎవరైనా సరే ఒంటరిగా ప్రయాణం చేస్తున్నప్పుడు వారు సురక్షితంగా గమ్యం చేరేవరకు పర్యవేక్షించేలా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలోని మహిళా భద్రత విభాగం టీ-సేఫ్ (ట్రావెల్ సేఫ్) యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ ఏడాది మార్చి 12నుంచి యాప్ అమలులోకి రాగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇప్పటివరకు సుమారు 1,500 మందికి పైగా మహిళలు డౌన్‌లోడ్ చేసుకున్నారు. నేరం జరిగిన తర్వాత దర్యాప్తు చేయడానికి బదులు.. నేరం జరగకుండా నివారిస్తూ ప్రజలు, ముఖ్యంగా మహిళలకు అండగా నిలవడమే లక్ష్యంగా దేశంలోనే మొదటిసారి తెలంగాణ పోలీసులు ఈ తరహా ప్రయాణంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్మార్ట్ ఫోన్లే కాకుండా సాధారణ ఫోన్ల నుంచి కూడా ఈ సేవలు పొందే అవకాశముండటం విశేషం.

మూడు రకాలుగా సేవలు

- **టీ-సేఫ్ యాప్ సేవలు:** స్మార్ట్ ఫోన్లున్న ప్రతి ఒక్కరూ గూగుల్ ప్లే స్టోర్ నుంచి టీ-సేఫ్-తెలంగాణ పోలీస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత అందులో సూచించినట్లు వివరాలు నమోదు చేయాలి. అంతే సదరు మహిళ/బాలిక/పౌరుడు సురక్షితంగా గమ్యం చేరేవరకు పోలీసులు లైవ్ ట్రాకింగ్ ద్వారా వాహనాన్ని పర్యవేక్షిస్తుంటారు. ఏదైన సమస్య ఎదురైతే వెంటనే రంగంలోకి దిగుతారు.
- **దయల్ 100:** దీనికి స్మార్ట్‌ఫోన్ అవసరం లేదు. సాధారణ ఫోన్ ఉన్నవారు ప్రయాణం ప్రారంభించే ముందు 'డయల్ 100'కు కాల్ చేయాలి. అందులో వచ్చే ఐవీఆర్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) ఆప్షన్‌లో 8వ నంబర్‌ను నొక్కాలి. వ్యక్తిగత వివరాలు, ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నాం, ప్రయాణించే వాహనం నంబర్ లాంటి వివరాలు ఇస్తే సరిపోతుంది. వెంటనే ఒక కోడ్ నంబర్‌ను పెట్టుకోవాల్సిందిగా సూచిస్తారు. ఆ తర్వాత గమ్యం చేరేదాకా పోలీసుల నుంచి ప్రతీ 15 నిమిషాలకు మీకు అలర్ట్ మెస్సేజ్, మధ్యలో ఐవీఆర్ పద్ధతిలో ఫోన్ కాల్స్ వస్తుంటాయి. అప్పుడు ముందే పెట్టుకున్న కోడ్ ద్వారా ఆన్సర్ చేయాల్సి ఉంటుంది. ఆ ఫోన్‌లో ఇతరులు ఆన్సర్ చేసేందుకు అవకాశం లేకుండా ముందే సిద్ధం చేసి పెట్టుకున్న కోడ్ ఉపకరిస్తుంది. ఒక వేళ సరైన స్పందన లేకపోతే వెంటనే వాహనం వివరాలు, రూట్, లైవ్ ట్రాకింగ్ లింక్ ఆ పరిధిలోని పోలీస్ పెట్రోలింగ్ వాహనాలకు వెళ్తాయి. నిమిషాల వ్యవధిలోనే వారు సదరు వాహనం వద్దకు చేరుకుంటారు.
- **టీ-సేఫ్ వెబ్‌సైట్:** ప్రయాణం చేసే సమయానికి మన దగ్గర ఉన్న స్మార్ట్ ఫోన్‌లో యాప్ లేదను కోండి. https:// tsafe. tspolice. gov. in/ wap/ వెబ్‌సైట్‌ను ఉపయోగించవచ్చు. ఇందులోకి లాగిన్ అయిన తర్వాత.. ఎక్కడికి వెళ్లాలి?.. పేరు.. జెండర్.. మొబైల్ నంబర్.. ప్రయాణిస్తున్న వాహనం.. వాహన్ నంబర్ నమోదు చేయాలి. ఆ తర్వాత స్మార్ట్ మై ట్రిప్ ఆప్షన్ ఓకే చేయాల్సి ఉంటుంది. అంతే ప్రయాణికుడు లేదా ప్రయాణికురాలు గమ్యం చేరేదాకా పోలీసులు పర్యవేక్షిస్తుంటారు.

అవగాహన కార్యక్రమాలతో..

మహిళల భద్రత, ప్రయాణికుల రక్షణ కోసం రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు షీ టీమ్ ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. టీ-సేఫ్ సేవలకు ప్రచారం కల్పిస్తూ మహిళా భద్రత విభాగం రూపొందించిన వీడియో రాష్ట్ర వ్యాప్తంగా వైరల్‌గా మారింది. వాట్సాప్, ఇతర సామాజిక మాధ్యమాల్లో ప్రజలు దీనిని వీక్షిస్తున్నారు. సురక్షిత ప్రయాణంపై అవగాహన పెంచుకుంటున్నారు. ఆటోలు, క్యాబ్‌లలో ప్రయాణం చేస్తున్నప్పుడు టీ-సేఫ్ యాప్‌ను ఉపయోగించుకుంటే ప్రయాణం పూర్తయ్యేదాకా నిర్ణీత సమయంలో పోలీసుల నుంచి అలర్ట్ ఎస్‌ఎంఎస్‌లు, ఫోన్‌కాల్స్ వస్తుండడంతో ప్రయాణికులు ఎలాంటి అభద్రతాభావం, ఆందోళన లేకుండా ప్రయాణించవచ్చని అధికారులు చెబుతున్నారు. పౌరుల ప్రయాణాన్ని పోలీసులు నిజంగానే పర్యవేక్షిస్తున్నారా..?లేదా..? అని పరీక్షించేందుకు కూడా కొందరు టీ-సేఫ్ సేవలను వినియోగిస్తున్నారని అధికారులు వివరించారు.

ప్రయాణికుల భద్రత కోసమే..



ఒంటరిగా ప్రయాణంచేసే మహిళలకు/పురుషులకు భద్రత కల్పించేందుకు పోలీస్ భద్రత విభాగం అధికారులు టీ-సేఫ్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఒంటిరిగా ప్రయాణించే వారు.. ప్రయాణిస్తున్న వివరాలను టీ-సేఫ్ యాప్‌లో ఎంట్రీ చేయగానే ప్రయాణం పూర్తయ్యేదాకా పర్యవేక్షిస్తుంటారు. ఒంటరిగా ప్రయాణించే వారికి ఇది భద్రతగా ఉంటూ రక్షణ కల్పిస్తుంది. ఏదైన అపాయం ఎదురైతే పోలీసులు వెంటనే పసిగట్టి ఘటనాస్థలానికి చేరుకుని ఆకతాయిల ఆట కట్టిస్తారు. మహిళలు, ఒంటరి ప్రయాణికులు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

– శ్రీనివాసులు, రామగుండం సీపీ

నేడు విద్యుత్ అంతరాయం

శ్రీరాంపూర్: సింగరేణి శ్రీరాంపూర్ ఏరియాలో నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని శ్రీరాంపూర్ డీజీఎం పర్సనల్ అరవిందరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మందమర్రిలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శ్రీరాంపూర్ ఏరియాలోని సింగరేణి కాలనీలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. కార్మిక కుటుంబాలు సహకరించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుడికి గాయాలు



కాలి గాయంతో మల్లయ్య

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో శనివారం మొదటి షిఫ్టులో బెల్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న పూదరి మల్లయ్యగౌడ్ అనే కాంట్రాక్ట్ కార్మికుడికి గాయాలయ్యాయి. కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. అధికారుల ఆదేశాల మేరకు మల్లయ్యగౌడ్‌కు బెల్ట్ క్లీనింగ్ పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు బొగ్గుపెల్ల మల్లయ్య కాలిపై పడటంతో తీవ్రగాయమైంది. వెంటనే అధికారులు అతడిని గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదంలో మల్లయ్య కాలి ఎముక విరగగా వైద్య సిబ్బంది పట్టీవేసి ఇంటికి పంపించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే..

గోలేటి సీహెచ్‌పీలో అధికారులు కార్మికుల రక్షణను పూర్తిగా గాలికి వదిలేశారని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఓ ప్రకటనలో ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యంతో గోలేటి సీహెచ్‌పీలో బెల్ట్‌వద్ద విధులు నిర్వహిస్తున్న మల్లయ్యగౌడ్‌కు గాయాలయ్యాయని పేర్కొన్నారు. వానాకాలం కావటంతో బెల్ట్ వద్ద విధులు నిర్వహించే సమయంలో అధికారులు పూర్తిస్థాయిలో రక్షణ కల్పించాల్సి ఉన్నా పట్టించుకోకపోవటంతోనే ప్రమాదం చోటు చేసుకుందని తెలిపారు. ప్రమాదానికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'బీఆర్‌ఎస్ మాటలు నమ్మొద్దు'



బస్సులో మహిళలతో మాట్లాడుతున్న సుగుణ

జన్నారం: రుణమాఫీపై బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్న మాటలు నమ్మొద్దని, అర్హులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంటరీ నాయకురాలు ఆత్రం సుగుణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీ అర్హులందరికీ జరిగిందని, ప్రత్యేక సర్వే చేపట్టి చిన్నచిన్న తప్పిదాలతో మాఫీ రాని రైతులకూ వర్తింపజేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తుంటే ఓర్వలేకే బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ భేషరతుగా మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

బస్సెక్కి.. మహిళలతో మాట్లాడి..

ఆత్రం సుగుణ తన పుట్టినిల్లయిన తిమ్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తపాలాపూర్‌లో బస్సు ఎక్కి జన్నారం వరకు ప్రయాణించారు. ఈ సందర్భంగా బస్సులో మహిళలతో మాట్లాడారు. రాఖీ పండుగ సందర్భంగా అనేకమంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవడంపై హర్షం వ్యక్తంజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, ప్రధాన కార్యదర్శి మాణిక్యం, మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, నాయకులు రాజశేఖర్, శంకరయ్య, కాంతామణి, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్సెంటివ్ ఇప్పించాలి



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న నేతలు

శ్రీరాంపూర్: లక్ష్యానికి తగినట్లు బొగ్గు తీసినా తమకు ఇన్సెంటివ్ రావడం లేదని ఆర్కే 6 గని కార్మికులు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులకు మొర పెట్టుకున్నారు. శనివారం యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా గనిని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఇన్సెంటివ్ విధానం సరిగా లేక తాము నష్టపోతున్నామని కార్మికులు తెలిపారు. దీనిపై తాము యాజమాన్యంతో మాట్లాడుతామని ఏఐటీయూసీ నేతలు హామీ ఇచ్చారు. ఉద్యోగుల పర్సనల్ రికార్డులకు సంబంధించి యాజమాన్యం కొత్తగా తీసుకువచ్చిన యాప్‌ను ఎలా వినియోగించుకోవాలో ఏఐటీయూసీ నేతలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూనియన్ పిట్ సెక్రటరీ సంగం సదానంద, నాయకులు కారుకూరి నగేశ్, బాలసారి లక్ష్మణ్, రాంచందర్, సాయిబాబా, అద్దు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కారు ఢీకొని ఒకరు మృతి

బెల్లంపల్లి: టీ తాగడం కోసం జాతీయ రహదారిని దాటుతుండగా అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చిన ఓ కారు ఢీకొట్టడంతో దినసరి కూలీ మృతి చెందాడు. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బెల్లంపల్లి గంగారాంనగర్ బస్తీకి చెందిన కొమ్ము శివకుమార్ (32) శనివారం ఉదయం పనిమీద బజారు ఏరియాకు వెళ్లడానికి అవతలి వైపు నుంచి రోడ్ క్రాస్ చేశాడు. రోడ్డు పక్కకు బైక్ పార్కింగ్ చేసిన శివకుమార్ తిరిగి గాంధీనగర్ వైపు ఉన్న ఓ హోటల్‌లో టీ తాగడానికి డివైడర్ మీదుగా రోడ్ దాటుతున్నాడు. ఈక్రమంలో తాండూర్ వైపు నుంచి మంచిర్యాల వైపునకు వెళ్తున్న కారు డ్రైవర్ దీపక్ అతివేగంగా, అజాగ్రతగా నడిపి ఢీకొట్టడంతో శివకుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సత్యవతి క్యాన్సర్ పేషెంట్ కాగా, ఐదేళ్ల కొడుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జ్వరంతో మహిళ మృతి



చెన్న లక్ష్మి (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): హాజీపూర్ మండలం నంనూర్ పరిధి చందనాపూర్ గ్రామానికి వివాహిత చెందిన చెన్న లక్ష్మి (50) జ్వరంతో మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చందనాపూర్ గ్రామానికి చెందిన చెన్న లక్ష్మి రోజు కూలీ. వారం రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ లక్సెట్టిపేటలోని ఓ ప్రైవేట్ వైద్యుడి వద్ద చికిత్స పొందుతోంది. శుక్రవారం లక్ష్మికి ఒక్కసారిగా జ్వరం తీవ్రం కాగా హాజీపూర్ మండలం నంనూర్ గ్రామానికి చెందిన మరో ప్రైవేట్ వైద్యుడి వద్ద చికిత్స తీసుకుంటూ ఫిట్స్‌కు గురైంది. దీంతో లక్ష్మిని బంధువులు వెంటనే మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి మరింత విషమంగా మారడంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు లక్ష్మిని పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలికి భర్త రాయలింగు ఉన్నాడు. నలుగురు కుమార్తెలుండగా అందరికీ వివాహాలయ్యాయి.

108 పైలెట్లకు పురస్కారం



పైలెట్లను అభినందిస్తున్న సామ్రాట్

లక్సెట్టిపేట: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ రాష్ట్ర వ్యాప్తంగా 108 అంబులెన్స్‌లో పనిచేస్తున్న పలువురిని ఉత్తమ పైలెట్లుగా ఎంపిక చేసింది. అందులో లక్సెట్టిపేట 108 అంబులెన్స్‌లో స్టార్ పైలెట్లుగా పనిచేస్తున్న కముటం గంగన్న, మామిడి సత్యం ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారు హైదరాబాద్‌లో ఉత్తమ పురస్కారాన్ని అందుకున్నారు. వారిద్దరినీ 108 అంబులెన్స్‌ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి సంపత్, తోటి పైలెట్లు అభినందించారు.

సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి



మాట్లాడుతున్న సీతారామయ్య

బెల్లంపల్లి: సింగరేణి కంపెనీకి ట్రాన్స్‌కో, జెన్‌కోలు బకాయిపడ్డ రూ.29 వేల కోట్లు వెంటనే చెల్లించే ఏర్పాట్లు చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు వీ సీతారామయ్య డిమాండ్ చేశారు. శనివారం మందమర్రి ఏరియా శాంతిఖని గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. కొన్నేళ్లుగా ట్రాన్స్‌కో, జెన్‌కో విద్యుత్ సంస్థలు సింగరేణికి పెండింగ్ బిల్లులు చెల్లించకుండా తీవ్ర కాలయాపన చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో భూగర్భ గనులను ప్రారంభించేందుకు యాజమాన్యం గతంలోనే సర్వే చేయించి సిద్ధంగా ఉంచిందని పేర్కొన్నారు. కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో భూగర్భంలో అపారమైన బొగ్గు నిక్షేపాలున్నాయని సర్వే ద్వారా నిర్ధారణ అయిందని చెప్పారు. సింగరేణిలో ఏటా కార్మికుల సంఖ్య తగ్గుముఖం పడుతోందని ఈక్రమంలో సర్వే చేసిన ప్రాంతాల్లో భూగర్భ గనులను ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి ఆర్థిక భరోసా ఇవ్వాలని కోరారు. శ్రావణ్‌పల్లి బొగ్గు బ్లాక్‌ను సింగరేణి సంస్థకు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి వెంటనే కార్మికులకు లాభాల వాటా 35శాతం చెల్లించేలా చూడాలని కోరారు. సింగరేణిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లను జారీ చేయించామని వివరించారు. కార్మికులకు విధించిన ఇన్‌కం టాక్స్‌ను వెంటనే రద్దు చేయాలని ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ సింగరేణి విభాగం బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు దాసరి తిరుపతిగౌడ్, రెండు బ్రాంచ్‌ల ఇన్‌చార్జి చిప్పనర్సయ్య, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, నాయకులు రమేశ్, రాంచందర్, రత్నపం ఐలయ్య, సంతోష్, శ్రీనివాస్, ప్రవీణ్, రాజలింగు, శ్రీకాంత్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో ఉత్సాహంగా సాగాలి



ఖమ్మం వాలీబాల్ జట్టుకు ట్రోఫీ ఇస్తున్న అధికారులు



క్యారం విజేత జాకీర్‌కు ట్రోఫీ ఇస్తున్న అధికారులు

ఆదిలాబాద్: విద్యుత్ ఉద్యోగులు క్రీడల్లో రాణించినట్లే విధి నిర్వహణలోనూ ఉత్సాహంగా సాగాలని ఆదిలాబాద్ విద్యుత్‌శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్, నిర్మల్ ఎస్ఈ శ్రీనివాస్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం ప్రారంభమైన విద్యుత్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి వాలీబాల్, క్యారం పోటీలు శనివారం ముగిశాయి. విజేతలుగా నిలిచిన జట్లకు వారు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. నిత్యం విద్యుత్ సరఫరా విషయంలో బిజీబిజీగా ఉండే ఉద్యోగులకు క్రీడల నిర్వహణ ఎంతో ఉత్సాహపూరిత వాతావరణాన్ని కలిగించిందని చెప్పారు. విద్యుత్ శాఖలోనూ ఎంతో ప్రతిభ గల క్రీడాకారులున్నారని, ప్రోత్సాహన్నిస్తే మంచి క్రీడాకారులుగా ఎదుగుతారని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, సెక్రటరీ శ్రీనివాస్, అధికారులు జీవరత్నం, దేవాగౌడ్, హరికృష్ణ, నాగరాజు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వాలీబాల్ విజేతగా ఖమ్మం, రెండో స్థానంలో మహబూబ్‌నగర్, మూడో స్థానంలో ఆదిలాబాద్ నిలిచింది. ఇక క్యారం టీం ఈవెంట్లో విద్యుత్ సౌధ జట్టు మొదటి స్థానం, రెండో స్థానంలో నిజామాబాద్, మూడో స్థానంలో మెట్రోజోన్ హైదరాబాద్ జట్లు నిలిచాయి. ఓపెన్ సింగిల్స్‌లో జాకీర్ (మెట్రో జోన్, హైదరాబాద్) విజేతగా నిలిచాడు. ఓపెన్ డబుల్స్ ఈవెంట్లో మొదటి రెండు స్థానాల్లో మెట్రో జోన్ హైదరాబాద్ నిలువగా, మూడో స్థానంలో విద్యుత్ సౌధ జట్లు నిలిచాయి.

గురుకుల పాఠశాలల తనిఖీ



కమిషనర్‌కు ఎలర్జీ చూపిస్తున్న విద్యార్థులు

చెన్నూర్: చెన్నూర్ పట్టణంలోని మైనార్టీ గురుకుల, సాంఘిక సంక్షేమ బాలబాలికల పాఠశాల, కళాశాలలను శనివారం మున్సిపల్ కమిషనర్ గంగాధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో నలుగురు విద్యార్థులు ఎలర్జీ, ఇద్దరు విద్యార్థులు జ్వరాలతో బాధపడుతున్నట్లు తెలుసుకున్నారు. ఫ్యాన్లు, బాత్‌రూమ్ డోర్లు లేవని విద్యార్థులు తెలిపారు. దీంతో సమస్యలు పరిష్కరించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కుళ్లిన కూరగాయలు, పురుగులు పడిన శనగపిండి బస్తాలు ఉండడంతో అధికారులు, నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ విజిట్ చేసేనాటికి మార్పు కనిపించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని హెచ్చరించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు, పరిస్థితుల గురించి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, వార్డు ఆఫీసర్ తిరుపతి, ప్రిన్సిపాల్‌లు, వార్డెన్లు ఉన్నారు.

గుంటకల్‌లో యువకుడి మిస్సింగ్



దేవురావు (ఫైల్)

తాంసి: భీంపూర్ మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ఒకరు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా గుంటకల్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయాడు. చింతపల్లి గ్రామానికి చెందిన కుమ్ర దేవురావు (29) ఈ నెల 12వ తేదీన తిరుపతికి దైవదర్శనం కోసం బంధువులతో వెళ్లాడు. దర్శనం అనంతరం ఈనెల 15న తిరిగి వస్తున్న క్రమంలో గుంటకల్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ సోదరుడు మిస్సింగ్ అయినట్లు భీంపూర్ పోలీస్‌స్టేషన్‌లో భీంరావు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై కలీం తెలిపారు. దేవురావు ఆచూకీ తెలిస్తే 9959272153, 7729029944 నంబర్లకు తెలియజేయాలని సూచించారు.

మద్యం దుకాణంలో యువకుల వీరంగం



గాయపడ్డ సాయితేజ, దుర్గయ్య

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ మద్యం దుకాణంలో ఇద్దరు యువకులు శనివారం రాత్రి బీరు సీసాలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక వొడ్డెర కాలనీకి చెందిన గుంజ సాయితేజ, ముప్పు దుర్గయ్య ఇద్దరూ తెలిసిన వ్యక్తులు కావడంతో స్థానిక వైన్‌షాపులో మద్యం సేవిస్తున్నారు. మద్యం మత్తులో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారి తీసింది. దుర్గయ్య, సాయితేజ బీరు సీసాలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో సాయితేజ కడుపుపై బీరు సీసాతో పొడిచేందుకు ప్రయత్నించగా గాయాలయ్యాయి. దుర్గయ్యకు కాలుపై స్వల్ప గాయాలయ్యాయి. వీరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. ప్రాణాపాయ గాయాలు కాలేదని వైద్యులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక సీఐ బన్సీలాల్‌ను వివరణ కోరగా మద్యం మత్తులో ఇరువురు దాడి చేసుకున్న ఘటన తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇరువురి వివరాలు సేకరించి దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ఐబీపీ పెట్రోల్ పంపు వద్ద గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం గంజాయి తరలిస్తున్నారనే సమాచారం మేరకు మండల కేంద్రంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన చంద్రమౌళి, మహారాష్ట్రలోని బల్లర్పూర్‌కు చెందిన అర్బాస్‌ఖాన్ బైకులో గంజాయి తరలిస్తుండగా ఏఎస్సై రాజయ్య, సిబ్బంది వెంబడించారు. వారిని అదుపులోకి తీసుకుని 240 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, రెండు బైకులను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు.